


శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట

# జూనియర్ లైన్‌మెన్లకు 'రెగ్యులర్ స్కేల్' ఇవ్వాలి




**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

గ్రేడ్2 లైన్‌మెన్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో యుఈఈయు, యుఈసిడబ్ల్యుయు మద్దతుతో శుక్రవారం మహాధర్నా చేపట్టారు. తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం వద్ద నాలుగు జిల్లాలకు చెందిన గ్రేడ్2 లైన్‌మెన్లు వందలాది మంది హాజరై నడిరోడ్డుపై మండుటెండలో బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. కార్మికులు మహాధర్నా చేపడతారని ముందుగానే తెలుసుకున్న యాజమాన్యం వందలాది మంది పోలీసులను డిస్కం కార్యాలయం, ఎస్ఈ కార్యాలయం వద్ద మోహరింప చేశారు. 10 గంటలకు కార్మికుల ధర్నా అని ప్రకటిస్తే ఉదయం 8 గంటలకే పోలీసులు సుమారు 200 మంది డిస్కం వద్దకు చేరుకుని కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, రోప్‌వేలు కట్టి, కట్టుదిట్టమైన భద్రతతో పహారా కాశారు. వివిధ జిల్లాల నుంచి తిరుపతికి చేరుకున్న కార్మికులు శ్రీనివాస కల్యాణమండపాల నుంచి ర్యాలీగా డిస్కం ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకుని, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా మహాధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళీ మాట్లాడుతూ గ్రేడ్2 లైన్లమెన్లది న్యాయమైన పోరాటం అన్నారు. ఎలక్ట్రికల్ సంస్థ నోటిఫికేషన్ ద్వారా గ్రేడ్2 పోస్టులు భర్తీ చేశారని, వారికి ఎలక్ట్రిసిటి వర్తింప చేసేవి అన్ని వర్తింప చేయాలన్నారు. నెలకు 22 వేల చొప్పన వేతనాలు ఇవ్వడం కాదని, రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే స్కేల్ ప్రకారమే జీతాలు ఇవ్వాలన్నారు. గ్రేడ్2 లైన్‌మెన్లు ధర్నా అంటే టిఏ బిల్లులను విడుదల చేస్తున్నట్లు గురువారం అధికారులు ప్రకటించారని, ప్రశ్నిస్తే తప్ప సమస్యలు పరిష్కరం అయ్యేలా కనబడటం లేదన్నారు. ఎలక్ట్రిసిటి రంగం ప్రస్తుతం లక్ష కోట్లు అప్పుల్లో ఉందని, ఈ అప్పులన్నీ కార్మికులు, ఉద్యోగులు, లైన్‌మెన్లు వారి సమస్యల పరిష్కారం కోసం కాదని, అంబానీ, అదాని జేబులు నింపేదుకేనని ధ్వజమెత్తారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎనర్జీగా ఉండాల్సిన ఎనర్జీ అసిస్టెంట్లు ప్రభుత్వ అరాకొర జీతాలతో కనీసం కడుపునిండా తిండి తినలేని పరిస్థితులు దాపురించాయన్నారు. ఐదు సంవత్సరాలుగా ప్రొబేషన్ డిక్లరేషన్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. యుఈఈయు రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని, తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసి డైరెక్ట్ పేమెంట్ కల్పించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రావలసిన అరియర్స్ అమౌంట్ వెంటనే ఇప్పించాలని డిమాండు చేశారు. లైన్‌మెన్లుకు ఇస్తున్న వాటిని గ్రేడ్2 లైన్‌మెన్లుకూ అమలు చేయాలని కోరారు. యుఈఈయు నాయకులు పెంచల్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రేడ్2 లైన్‌మెన్లు సచివాలయం ఉద్యోగులా, విద్యుత్ సంస్థకు చెందిన ఉద్యోగులా అనేది తెలియని తికమక పరిస్థితుల్లో వారిని నెట్టడం సరైనది కాదన్నారు. విద్యుత్ సంస్థ వేతనాలు చెల్లిస్తూ, మీరు సచివాలయం ఉద్యోగులు అనే విధంగా వారిని రెండిటికి చెడ్డ రేవులా తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిస్కం అధ్యక్షులు శివశంకర్ మాట్లాడుతూ ఎలక్ట్రిసిటిలో పని చేస్తున్న ఉద్యోగులను రెండు రకాలుగా విభజించిన పరిస్థితి నేడు నెలకొందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత ఏడాది డిసెంబరు 28న అధికారులకు నోటీసులు ఇచ్చామని, ఇప్పటి వరకు పరిష్కరించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో మహాధర్నాకు పిలుపునిచ్చామన్నారు. ఇప్పటికీ అధికారులు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ సుబ్బరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రసూల్ అహ్మద్, మునిరాజా, సుమన్, సుదీర్, తేజ, సునీల్ పాల్గొన్నారు.

### డిస్కం వద్ద భారీగా పోలీసులు
### మండుటెండలోనూ రోడ్డుపై మహాధర్నా



లైన్‌మెన్‌ల ప్రదర్శన

# ఆర్థిక బకాయిలు చెల్లించండి

## జిల్లావ్యాప్తంగా యుటిఎఫ్ నిరసనలు

**ప్రజాశక్తి - శ్రీకాళహస్తి, యంత్రాంగం**

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ 12వ పిఆర్సి విధి విధానాలు నిర్ణయించక ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని మండిపడ్డారు. నివేదిక వచ్చేంతవరకు 30 శాతం ఇంటీరియర్ రిలీఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి అపరిస్కృతంగా ఉన్న సరెండర్ లీవులు, ఎన్ క్యాష్ మెంట్ బకాయిలను ఇవ్వాలని కోరారు. మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లు, పెన్షనర్ల ఫైనల్ పేమెంట్లు చెల్లించాలనీ, పిఎఫ్ సైట్ ను వెంటనే పునరుద్ధరించాలనీ, పిఎఫ్ కి సంబంధించి చందాలు, వడ్డీలు, సకాలంలో చెల్లించేలా, పిఆర్సిడిఎ అరియర్స్ ను జమ చేయాలని సూచించారు. కె.మోహన్ బాబు, సి వెంకట కష్ణ, ఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

– గూడూరు టౌన్‌లో మండల విద్యావనరుల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. తిరుపతి జిల్లా కార్యదర్శి జి.సుధీర్, రవి,నాగేశ్వరరావు, మురళిసింగ్ పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండల శాఖలఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. శనివారం అన్ని తాలూకాకేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

– వెంకటగిరిలో ఎంఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కె.ఉదయ్‌కుమార్, వెంకటగిరి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జగదీశ్వరి, ఆదినారాయణ, సుబ్రమణ్యం, డక్కిలి నాయకులు గంగారావు, వెంకటేశ్వర్లు, బాలాయపల్లి నాయకులు రత్నశేఖర్, వాణిశ్రీ, కరుణ పాల్గొన్నారు.

– పుత్తూరులో నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శేఖర్, గీతమ్మ, కొలత్తూరు భాస్కర్ పాల్గొన్నారు.

– తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. యుటిఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లాకోశాధికారి పత్తిపాటి రమేష్‌నాయుడు, జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, అవనిగడ్డ పద్మజ, శేఖర్ పాల్గొన్నారు.

# అంబేద్కరా..ఆలకించు..!

## జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీల వినతులు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం**

భారత రాజ్యాంగాన్ని కాకుండా, తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న సిఎం జగన్‌కు భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని అంగన్‌వాడీలు విమర్శించారు. గత 39 రోజులుగా మహిళలు రోడ్డుపైకొచ్చి పండగలను సైతం పక్కన పెట్టి సమ్మె చేస్తుంటే పట్టించుకోని జగన్ తీరును వివరిస్తూ 'అంబేద్కరా.. మా మొర విను' అంటూ జిల్లావ్యాప్తంగా వినతిపత్రాలను అందజేశారు.

– శ్రీకాళహస్తిలో ఐసిడిఎస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ నాయకులు రేవతి, శోభ మాట్లాడుతూ అంగన్‌వాడీలు రాజ్యాంగబద్ధంగా సమ్మె చేస్తుంటే సిఎం జగన్ ఎస్మాస్త్రాన్ని ప్రయోగించి ఉక్కుపాదంతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటన్నారు.

–గూడూరు టౌన్‌లో టవర్‌క్లాక్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఇంద్రావతి, సిఐటియు నాయకులు బివి రమణయ్య, సురేష్ నేతృత్వంలో నిరసన తెలిపారు.

– రేణిగుంటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం ఇచ్చి పాదాభివందనం చేశారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ధనమ్మ, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ లక్ష మంది మహిళలురోడ్డున పడి 39 రోజులుగా సమ్మె చేస్తుంటే జగనన్నకు కనబడలేదా? అని ప్రశ్నించారు.

– కోటలో కారు స్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వచ్చి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. తిరుపతి జిల్లా అధ్యక్షురాలు పద్మలీలమ్మ మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధిద్దామని అన్నారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



తిరుపతిలో వినతి

– నాయుడుపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. ప్రాజెక్టు నాయకురాలు ఎన్.శ్యామలమ్మ, సిఐటియు నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించాలని 1951లో తన మంత్రి పదవికి రాజీనామా చేసిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అయితే జగన్ మహిళా సాధికారత అంటూనే అంగన్‌వాడీలను రోడ్డున పడేశారన్నారు.

– పుత్తూరు టౌన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో రిలే దీక్షలను పది మందితో ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. టెర్మినేషన్ నోటీసులను రద్దు చేయాలని నినాదాలు చేశారు. తమను తొలగించాలని చూస్తే, రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగిస్తామని హెచ్చరించారు. మునికుమారి, విజయ్‌కుమారి, మోహన్ లక్ష్మి పాల్గొన్నారు



గూడూరులో...

# ఐటి హబ్‌గా నెల్లూరు, తిరుపతి

## 'రా కదలి రా..' సభలో చంద్రబాబు హామీ



**ప్రజాశక్తి-వెంకటగిరి**

తాము అధికారంలోకి వస్తే నెల్లూరు, తిరుపతిలను ఐటి హబ్‌గా తీర్చిదిద్దుతామని నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో జగన్ అరాచక పాలనను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. వెంకటగిరి వైసీపీ ఇన్ ఛార్జి ఇసుక దోపిడీ, గ్రావెల్ దందా, క్వార్జ్ తవ్వకాలు చేస్తున్నారని విమర్శించారు. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితన్నారు. కేజీఎఫ్ త్రీగా ఈప్రాంతాన్ని మార్చిన ఘనత ఈప్రభుత్వానికే దక్కిందన్నారు. 2024 ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించుకుటకు తిరుపతి పార్లమెంట్ బహిరంగసభ శుక్రవారం వెంకటగిరిలోని హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ సమీపంలో జరిగింది. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'సాక్షి పత్రికలో వివేకాది గుండెపోటన్నారు ..రక్తం మరకలు ఏమిటంటే వాంతులన్నారు.. చివరికి వివేకా కూతురిపైనే కేసు వేసే పరిస్థితికి వచ్చారని విమర్శించారు. 29 మంది ఎమ్మెల్యేలని మారుస్తున్నారని విమర్శించారు. జగన్ పాలన 'కనకపు సింహాసమున శునకమున కూర్చొండబెట్టి రాజుగా పట్టాభిషేకం చేస్తే..ఆ సింహాసనాన్నే నాశనం చేసిందట' అనే సామెతను వల్లించారు. మద్యపానం నిషేధించాకే ఓటు అడుగుతానని చెప్పి ఎన్నికల్లో గెలిచి ఆ మద్యం అమ్మకాలపై 36 వేల కోట్లు అప్పులు తెచ్చిన ఘనత జగన్‌కే చెల్లిందన్నారు. కరెంటు ఛార్జీలు తొమ్మిది సార్లు పెంచి ప్రజలపై అధిక ఆర్థిక బారాలు మోపారన్నారు. భూమన మొన్నటి వరకు నాస్తికుడని, ఇప్పుడేమో టీటీడీ ఛైర్మన్‌గా వెలగపెడుతున్నాడన్నారు. పెద్ద ఆఫీసర్ ఒకాయన స్వామిని అడ్డంపెట్టుకుని పైరవీలు చేసుకొని కోట్లాది రూపాయిలు స్వామి డబ్బును దోచుకుంటున్నారన్నారు. తమ ప్రభుత్వంలో వరదలు వచ్చినప్పుడు ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు ఇచ్చి ఆదుకున్నామన్నారు. రాష్ట్రంలో ఏ కులస్థులైనా బాగున్నారా.. ఏమతస్థులైనా బాగున్నారా..కనీసం రెడ్లు అయినా బాగున్నారా అంటూ ప్రజలను సూటిగా ప్రశ్నించారు. జగన్ పోవాలి, రాష్ట్రాన్ని కాపాడుకోవాలి అని పిలుపునిచ్చారు. తాను యువత కోసం 25 ఏళ్ల కిందట ఐటీ ఆయుధంగా ఇస్తే, ఇప్పుడదే వజ్రాయుధం అయ్యిందన్నారు. తిరుపతి, నెల్లూరు, చెన్నైని ఒక ఐటి హబ్‌గా మారుస్తానని హామీ ఇచ్చారు. 16 లక్షల కోట్లు పెట్టుబడులను తాము తెస్తే జగన్ నిరుద్యోగం పెంచారన్నారు. కియా వంటి పరిశ్రమలు తెస్తే వాటికే కన్నం వేశాడీ జగన్ అన్నారు. తాము ఐటీ ఉద్యోగాలిస్తే జగన్ వాలంటీర్ల ఉద్యోగాలు, బ్రాందీ షాపులో ఉద్యోగాలు, ఫిష్ మార్కెట్ ఉద్యోగాలిచ్చాడని ఎద్దేవా చేశారు. ఇసుక తైలం తీసి కోట్లు దోచారన్నారు. తిరుపతిలో 4వేల కోట్ల పీడీఆర్ బాండ్లు పేరుతో దోచారన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి నిరాహారదీక్షకి దిగి పోరాటం చేశారని తెలిపారు. ప్రజా సంపద, ప్రజలందరి కోసం వినియోగించాలన్నారు. . జగన్ 45లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టి ఇసుకంతా దోచేశారన్నారు. మొన్న బీచ్ శ్యాండ్‌ని అమ్మాలని చూస్తే కోర్టు ఆపిందన్నారు. జగన్‌కి ఓడిపోతామనే భయం పట్టుకుందన్నారు. ప్రజలు గెలవాలి ..జగన్ పోవాలి.. అని మరోసారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి , మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, మాజీ కేంద్రమంత్రి పనబాకలక్ష్మీ, తిరుపతి పార్లమెంట్ పరిశీలకులు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీకాళహస్తి టిడిపి ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి, ప్రముఖపారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, డాక్టర్ మస్తాన్‌యాదవ్, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ పాల్గొన్నారు.


చంద్రబాబును కలిసిన పసుపులేటి హరిప్రసాద్


రా కదలి రా సభకు విచ్చేసిన జనం

### శ్రీవారి సేవలో కెఎస్ జవహర్‌రెడ్డి

**ప్రజాశక్తి - తిరుమల** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి దంపతులు శుక్రవారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి అభిషేక సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్‌ను జెఈవో వీరబ్రహ్మం అందజేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, విజివో గిరిధర్‌రావు, రిసెప్షన్ ఓఎస్‌డి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.



వేమనకు నివాళి

### సమాజాన్ని మేల్కొల్పిన కవి వేమన

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**

అందరికీ అర్థమయ్యే సరళ భాషలో వేమన పద్యం ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని, వేమన పద్యానికి అందరూ దాసోహమే అని వక్తలు ఉద్ఘాటించారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేమన జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యశోదనగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ గౌరవధ్యక్షులు టెంకాయల దామోదరం మాట్లాడుతూ మూఢనమ్మకాలు ప్రబలంగా ఉన్న రోజుల్లో సత్యాన్వేషణ ద్వారా రుజువులతో కూడిన అంశాలను బహిర్గతం చేశారన్నారు. ఆయన జ్ఞానాన్ని అర్థం చేసుకుని వాటిని ఆచరించాలని పిలుపునిచ్చారు. మల్లారపు నాగర్జున మాట్లాడుతూ శ్రమను నమ్మిన వ్యక్తి వేమన అని తెలిపారు.భూమిలోనబుట్టు భూసారమెల్లను ..తనువులోనా బుట్టు తత్వమెల్ల ...శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను అని శ్రమవిలువను చాటిచెప్పాడన్నారు . వేమన తన జీవితంలో జరిగిన విషయాలను గమనించి సమాజంలోని చెడును పారదోలి, మనుషుల మధ్య బేధాలు విడనాడి సమసమాజ స్థాపన కోసం పాటు పడిన వ్యకి అని కొనియాడారు. పత్తిపాటి రమేష్ నాయుడు మాట్లాడుతూ మూడనమ్మకాలను పారదోలేందుకు తపనపడిన చరిత్రకారుడు వేమనని కొనియాడారు. ప్రస్తుతం తెలుగుభాష మరుగున పడుతుందని, ఆ భాష బతికి ఉండాలంటే పద్యం పదిలంగా ఉండాలని కోరారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ, కందుకూరికి వేమన మార్గదర్శిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో నడ్డి నారాయణ, వందవాసి నాగరాజు, మునిరత్నం, ఓవి రమణ, జి.బాలసుబ్రమణ్యం, చాయా మోహన్, మునిరాజ, మునిలక్ష్మీ, మునిరామయ్య, నెమలేటి కిట్టన్న, తహసున్నీసా ,గురునాథం పాల్గొన్నారు.

# టిటిడి కళాశాలలకు అటానమస్ హోదా

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

తిరుపతిలోని శ్రీ పద్మావతి డిగ్రీ, పిజి కళాశాల ఎస్‌విఆర్ట్స్, ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 10 సంవత్సరాల పాటు అటానమస్ (స్వయంప్రతిపత్తి) హోదాను మంజూరు చేసిందని టిటిడి జేఈవో సదా భార్గవి తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి అతిథి భవనంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33 విద్యా సంస్థలలో మూడు కళాశాలలకు అటానమస్ హోదా లభించినట్లు చెప్పారు. దీని వల్ల టీటీడీ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యాప్రమాణాలు, కళాశాలల అభివద్ధికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యావిధానం, పరీక్షల నిర్వహణ, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్‌లో మార్పులు చేసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. తద్వారా విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సామాజిక సేవా దక్పథంతో విద్యా బోధన, ఆధునిక సాంకేతికత ఆధారంగా కోర్సుల నిర్వహణ, మెమరీ బేస్డ్ విద్యావిధానం ఏర్పాటుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్రాంగణ ఎంపికలకు ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకు వస్తాయని వివరించారు. ఇందుకు సహకరించిన అధ్యాపక బృందం, సిబ్బందికి అభినందనలు తెలిపారు.ఎస్వీ ఆర్ట్స్ కళాశాల 1945లో 80 మంది విద్యార్థులతో ప్రారంభమై నేడు 22 కోర్సులతో 2,700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 1952లో శ్రీ పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రారంభమై 26 కోర్సులతో 2,800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 1952లో ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రారంభమై ప్రస్తుతం 19 కోర్సులలో 1850 మంది విద్యార్థులు చదువుతున్నారు. టిటిడి విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి, టీటీడీ విద్యా సంస్థల సలహాదారు మోహన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాళ్ళు డాక్టర్ టి.నారాయణమ్మ, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, మహదేవమ్మ, కళాశాల అధ్యాపక బందాన్ని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

**అభినందించిన జేఈవో సదా బార్గవి**



# అధికారులే 'బలి'

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో, తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో అధికార పార్టీ భారీగా దొంగ ఓట్లు చేర్చిందని ప్రతిపక్షాలు గొంతు చించుకొని మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇతర జిల్లాల నుంచి, ఇతర నియోజకవర్గాల నుంచి అధికార పార్టీ జనాల్ని తీసుకొచ్చి భారీ ఎత్తున దొంగ ఓట్లను వేయించారు. పోలింగ్ కేంద్రాల వద్ద దొంగ ఓట్లు వేస్తున్న వారిని స్వయంగా పోలీసులకు పట్టించినా ఫలితం లేకపోయింది. ఇటు పోలీసులు అటు ఎన్నికల అధికారులు అధికార పార్టీ చెప్పినట్టే పని చేశారు. వైసిపి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గురుమూర్తి గెలిచారు. కానీ దొంగ ఓట్లు వేసిన వారి పై చర్యలు లేవు. దీంతో ప్రతిపక్షాలు రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేశాయి. రెండున్నర సంవత్సరాల తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం చర్యలకు పూనుకుంది. తిరుపతి పార్లమెంట్ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గిరిషాపై వేటు వేసింది. తిరుపతి మున్సిపల్ కమిషనర్ గా ఉన్నప్పుడు ఆయన తన లాగిన్, పాస్వర్డ్ వైసీపీకి చెందిన వ్యక్తులకు అప్పగించారు. ఆ సమయంలో తిరుపతి ఉప ఎన్నికలో ఆయన రిటర్నింగ్ అధికారి(ఆర్వో)గాఉన్నారు. సదరు వ్యక్తులు ఆయన లాగిన్లో నుంచి 30 వేల కార్డులు డౌన్లోడ్ చేసి, వాటి ద్వారా దొంగ ఓటర్ కార్డులను సష్టిం చారు. అప్పటి నుంచే ఆయనపై ఈసీ నిఘా పెట్టింది. అక్రమ లాగిన్ వ్యవహారంపై నేరుగా ఈనెల 10, 12 తేదీల్లో జరిగిన సమావేశంలోనే ఆయన్ను ప్రశ్నించింది.

**గిరీషాకు సహకరించిన అధికారులపై చర్యలు...**

గిరీషాతో పాటు, ఆయనకు సహకరించిన మిగతా అధికారులపై త్వరలో చర్యలు తీసుకోనుంది. ఆర్వోతోపాటు ఏఆర్ఓగా పని చేసిన ఓ అధికారిపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఆ అధికారి తిరుపతిలోనే పని చేస్తున్నారు. ఆయనతోపాటు ఇక్కడ ఆర్డీవో గా పనిచేసిన అధికారి చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఆయన గత ఏడాది డిసెంబర్లో బదిలీపై పరిశ్రమల విభాగానికి వెళ్లారు. ఆ అధికారిపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వీరితోపాటు తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో తాసిల్దారుగా పనిచేసిన అధికారి ప్రస్తుతం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. అలాగే ఉప ఎన్నికల ఓ డిప్యూటీ తాసిల్దార్‌పైనా ఎన్నికల సంఘం చర్యలు తీసుకునే అవకాశం ఉందని చర్చ జరుగుతుంది. ప్రస్తుతం వీరిని కాపాడేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్టు వినికిడి. తమపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోకుండా చూడాలని రాజకీయ నాయకుల పై ఒత్తిడి చేస్తున్నారు. అధికారులతో పాటు, అధికార పార్టీకి చెందిన నేతలపై చర్యలు తీసుకుంటారా లేదా అని వేచి చూడాల్సి ఉంది. ఎందుకంటే ఆ నాయకులు తప్పించుకోవడానికి అవకాశాలు ఉన్నట్లు ప్రతిపక్ష పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు.

**తిరుపతి, చంద్రగిరి ఓట్ల జాబితా పై ఈసీ నిఘా**

ఇటీవల కాలంలో తిరుపతి అసెంబ్లీతో పాటు చంద్రగిరి అసెంబ్లీలో భారీగా దొంగ ఓట్లు నమోదు చేశారని, ప్రతిపక్ష పార్టీలు జిల్లా కలెక్టర్, డిఆర్ఓ తో పాటు ఆర్డీవోకు, తిరుపతి ఎన్నికల అధికారి కమిషనర్ కు, తిరుపతి అర్బన్ తాసిల్దార్ పలుమార్లు ఫిర్యాదు చేసినా దొంగ ఓట్లను తొలగించలేదు. దీంతో ప్రతిపక్షాలు ఇటు రాష్ట్ర ఎన్నికల సంఘం, అటు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఈనెల 22న తుది ఎన్నికల జాబితా ప్రకటించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కూడా తిరుపతి తో పాటు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితా పై నిఘా ఉంచినట్లు సమాచారం.

### 'దొంగ ఓట్ల'పై ఈసీ సీరియస్

## నేడు విద్యుత్ అంతరాయం

**ప్రజాశక్తి-తొట్టంబేడు:** విద్యుత్ లైన్ల మరమ్మతులు దృష్ట్యా మండలంలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ బాలాజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మూడవ శనివారం కావడంతో 33, 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు వివరించారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. శ్రీకాళహస్తి టౌన్, రూరల్, తొట్టంబేడు, బీఎన్ కండ్రిగ, ఏర్పేడు, కేవీబీపురం మండల పరిధిలో సబ్‌స్టేషన్లలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## బలరాంరెడ్డి సేవలు చిరస్మరణీయం: వీసీ

**ప్రజాశక్తి-క్యాంపస్:** ఎస్వీయూలో దాదాపు 20 సంవత్సరాల పాటు సిండికేట్ మెంబర్‌గా సెనేట్ సభ్యునిగా వర్సిటీకి ఎనలేని సేవ చేసిన ఘనత ఎం.బలరాం రెడ్డికి దక్కిందని వీసీ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. వర్సిటీలోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో శుక్రవారం బలరాంరెడ్డి ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య శ్రీనివాసులు రెడ్డి, జయచంద్రారెడ్డి, పద్మనాభం, రామకృష్ణారెడ్డి, రాజేశ్వరమ్మ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'మట్టి అద్దం' పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు, రచయిత యువశ్రీ మురళి కవితా సంపుటి 'మట్టిఅద్దం' పుస్తకాన్ని ఆదివారం తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్ వేదికగా ఆవిష్కరించనున్నట్లు అరసం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి పలువురు సాహితీవేత్తలు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని తెలిపారు.

## 'జగనన్న పాలవెల్లువ'పై అవగాహన

**ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు:** ప్రైవేటు డెయిరీల దోపిడీ నుండి పాడి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ పథకాన్ని ప్రవేశపెట్టిందని అమూల్ సంస్థ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లుట్లవారిపల్లిలో పాడిరైతులకు జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాడి రైతులకు మంచి ధర అందించడంతోపాటు, స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్లి శశిప్రియ, రూట్ ఇన్‌ఛార్జ్ రవిబాబు, మెన్టార్ జగదీష్, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర రావు, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డి, సిబ్బంది లావణ్య, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

### విద్యార్థులు సేవా గుణాన్ని
## పెంపొందించుకోవాలి: డిఎఫ్‌ఓ

**ప్రజాశక్తి-క్యాంపస్:** విద్యార్థులు తరగతి గదినుండే సేవా గుణాన్ని ఒక బాధ్యతగా పెంపొందించుకోవాలని డిఎఫ్ఓ జి.ధర్మరాజు పేర్కొన్నారు. ఎస్వీ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా తిరుపతి రూరల్‌లోని సి.గొల్లపల్లి వద్ద వారం రోజులపాటు జరిగే ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామంలోని పాఠశాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ రెడ్డిశేఖర్, సర్పంచ్ రవి, డాక్టర్ రమణ, డాక్టర్ పివి సత్య గోపాల్, డాక్టర్ సుధాకర్, దేవరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఏపీ బ్రాహ్మణ సేవా సమాఖ్య, తిరుపతి బ్రాహ్మణ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న బైరాగి పట్టణంలోని శ్రీ వైఖానస ఆశ్రమం ఆవరణలో రాష్ట్రవ్యాప్త బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కొత్తపల్లి అజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికకు మంచి ఆదరణ లభిస్తోందని, సంబంధాలు వెతుక్కోవలసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణులు ఈ వివాహ పరిచయ వేదికను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 500 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 60 సంవత్సరాల నిండిన బ్రాహ్మ ణ దంపతులకు షష్టిపూర్తి, 70 ఏళ్లు నిండిన దంపతులకు భీమరథ శాంతి, 80 ఏళ్లు నిండిన దంపతులకు సహస్ర చందన దర్శన కార్యక్రమా లు చేస్తున్నామన్నారు. సంబంధం కుదుర్చుకున్న వారిలో నిరుపేద బ్రాహ్మణుల కుటుంబాలను ఎంపిక చేసి ఉచిత వివాహాలు జరిపిస్తామన్నారు. రామశర్మ, శ్రీనివాస్, చక్రపాణి పాల్గొన్నారు.

## 'సీనియార్టీని పరిగణలోకి తీసుకోండి'

**ప్రజాశక్తి-క్యాంపస్:** జరగబోవు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు, మూల్యాంకనానికి తమ సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని విధులను కేటాయించాలని తిరుపతి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి జీవి.ప్రభాకరరెడ్డిని ఏపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, కార్యదర్శి డాక్టర్ జలగం రామానుజులు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల అనుభవమున్న అధ్యాపకులమని తమకు సముచిత స్థానం కల్పించాలన్నారు. వినతిని స్వీకరించిన ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సీనియారిటీని పరీక్షలకు, మూల్యాంకరానికి తప్పక వినియోగించుకుంటామన్నారు. అధికారిని కలిసిన బృందంలో ఉపాధ్యక్షులు చెంగల్‌రాజు, సురేంద్ర, మహిళా కార్యదర్శి సావిత్రిబాయి, సోమనాథ్ పాల్గొన్నారు.

## స్కేటింగ్ రింగ్‌కు భూమి పూజ

**ప్రజాశక్తి-పుత్తూరుటౌన్:**
పట్టణంలోని పురపాలక సంఘం పరిధిలో మరాఠి గేట్ సమీపంలో రూ.78లక్షల శాప్ నిధులతో నిర్మిస్తున్న స్కేటింగ్ రింగ్‌కు మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడల్లో భాగం, ఆరోగ్యం బాగుండాలంటే క్రీడలు అవసరం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎం రెడి, వైస్ ఛైర్మన్ జయప్రకాష్. ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్, ప్రకాష్, కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం, ఏకాంబరం, నాయకులు పాల్గొన్నారు.

# వన్యప్రాణులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు


**కాలినడక మార్గంలో టీటీడీ సహకారంతో రక్షణ చర్యలు**
**సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్**

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):**
అటవీ, వన్య ప్రాణుల రక్షణ అందరి బాధ్యతని, వాటికి హాని తలపెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అటవీ, వన్యప్రాణుల రక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ పోలీస్ తదితర శాఖలతో నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ రెడ్డి అజెండా మేరకు పలు సమస్యలను కమిటీ ఛైర్మన్ హోదాలో ఉన్న కలెక్టర్‌కు నివేదించారు. అటవీ భూభాగాలకు సంబంధించి భూ సంబంధిత పత్రాల సమస్యలు ఉన్నాయన్నారు. రెవెన్యూ యంత్రాంగం అటవీశాఖ సమన్వయంతో సంయుక్తంగా తనిఖీ చేసి పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాకాల, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తుందంటూ సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఏనుగుల గుంపును ట్రాకర్స్ ద్వారా పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గత ఏడాది ఆగస్టు మాసంలో అలిపిరి కాలినడక


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మార్గంలో చిరుతపులుల సంచారం నేపథ్యంలో జరిగిన దుర్ఘటనలకు శాశ్వత పరిష్కారం కోసం అలిపిరి కాలినడక ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, వైల్డ్ లైఫ్ ఇన్స్ టిట్యూట్ ఆఫ్ ఇండియా వారు సూచనల మేరకు టీటీడీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఎర్రచందనం శేషాచల అడవుల నుండి అక్రమంగా తరలిపోకుండా పోలీస్, ఎస్టీఎఫ్ అధికారుల సహకారంతో అటవీశాఖ అధికారులు స్మగ్లింగ్ పూర్తిస్థాయిలో అరికట్టడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. తదితర అంశాలపై వివరించారు. సమావేశంలో డీఆర్ఓ పెంచల్ కిషోర్, అదనపు ఎస్పి విమల కుమారి, సూళ్లూరుపేట డీఎఫ్ఓ శ్యాముల్, ఫ్లయింగ్ స్క్వాడ్ శివకుమార్, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతపై సర్పంచ్‌లు దృష్టి పెట్టాలి


ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి

**ప్రజాశక్తి-క్యాంపస్:** హెల్తీ విలేజ్ ప్రధాన అంశాలుగా తాగునీరు, పరిశుభ్రతపై పంచాయతీరాజ్ వ్యవస్థ, సర్పంచ్‌లు దృష్టి పెట్టాలని గతంలో పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన అనుభవంతో చెబుతున్నానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరుగుతున్న 'హెల్తీ విలేజ్' జాతీయ వర్క్ షాప్ 2వ రోజు అంశం రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ గ్రామీణ సేవల అంశాలపై నిర్వహణతో ప్రారంభం కాగా ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. వివిధ శాఖల కమిషనర్లు ఉన్నతాధికారులు వారికి సంబంధించిన అంశాలను సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తాగు నీటి విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామన్నారు. గ్రామపంచాయతీలు వీటిని సద్వినియోగం చేసుకొని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టినప్పుడే పరి శుభ్ర తాగునీరు విజయవంతంగా అమలు చేయగలుగుతామన్నారు. గ్రామాలలో పరిశుభ్రత ఇప్పటికే ప్రతి ఇంటికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్లు నిర్మించుకొని ఓడిఎఫ్‌లోకి వెళ్లామని అన్నారు. అదే రీతిలో తాగునీటి విషయంలో కూడా శ్రద్ధ వహిస్తే నీటి సమస్య తలెత్తదని ఆరోగ్య విషయంలో కూడా ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జె. నివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా వాడకం.. అనర్ధాలు అధికం

**ప్రజాశక్తి-బాలాయపల్లి:** అధిక యూరియా వాడకం వల్ల వరికి చీడ, పీడ అధికంగా సోకి నష్టం జరుగుతుందని తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం పి.భాస్కరయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంగమాంబపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఏవో శిరీష ఆధ్వర్యంలో 'ఆత్మ' పథకంలో భాగంగా రైతులకు యూరియా వాడకం వల్ల వచ్చే అనర్ధాలపై సమీక్షసమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నానో ఎరువుల ఆగ్ కస్ట్ నెల్లూరు జిల్లా లక్ష్మీ నారాయణ, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

**పెళ్లకూరు:** మండలంలోని పునబాకలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ప్రవీణ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం వారు "ఆత్మ పథకం"లో భాగంగా వరి సాగు విధానాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి మాట్లాడుతూ వరి సాగులో ఎరువుల వాడకం పొటాషియం ఉపయోగాలు గురించి తెలియజేసి నారు, వరిని ఆశించు పురుగులు, వివిధ రకాల తెగుళ్ళు, వాటి నివారణ చర్యలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏ దినేష్, పంచాయతీ కార్యదర్శి యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఊరూరా ఆరోగ్య శిబిరాలు

**ప్రజాశక్తి-పెళ్లకూరు:** మండలంలోని కానూరు సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శిబిరంలో డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలు అందించారు. అన్ని రోగాలకు సంబంధించిన మందులు లేకపోగా శిబిరం వల్ల ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని అక్కడికి వచ్చిన జనం వాపోయారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, అధికారులు విజయమ్మ, డాక్టర్‌లు చంద్రమోహన్‌రెడ్డి, సాయిలత, సిబ్బంది పాల్గొన్నారు.

**దొరవారిసత్రం:** మండలంలోని పూలతోట సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్స్ చంద్రకళ, వినయ్, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

**తొట్టంబేడు:** మండలంలోని పూడి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మృదుల వాణి, డాక్టర్ శివకుమార్, డాక్టర్లు మాధవ, ప్రవీణ్ హరిత, కాసారం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-ఏర్పేడు:** మండలంలోని పాపానాయుడుపేట పంచాయతీలో కాలేజీ వీధిలో ఉంటున్న షేక్ హయ్యద్ బాషా(34) అనారోగ్యంతో మరణించడం జరిగింది. అతని కుటుంబానికి ఆర్థిక సహాయం కింద రూ.10వేలను సర్పంచ్ మేకలత్తూరు లలితాకరుణాకర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, భార్గవి, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ

**ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్లను హెచ్‌ఎం రాజశేఖర్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి పాఠ్యపుస్తకానికి అనుగుణంగా బైజుస్ కంటెంట్‌తో ఈ ట్యాబ్‌లను రూపొందించడం జరిగిందన్నారు. విద్యార్థులు జాగ్రత్తగా బోధనకు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ చొరవతో నెరవేరిన దశాబ్దాల కల

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కృషితో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరింది. తిరుపతికి సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్, వెల్నెస్ సెంటర్ మంజూరైంది. ఈ సెంటర్ ఏర్పాటుకు భవనం ఎంపిక కోసం హైదరాబాద్ నుంచి సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మయ్య, ఆయన బృందం అక్కడికి వెళ్లింది. తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తితో చర్చించిన అనంతరం ఆ బృందం నగరంలోని పలు ఆస్పత్రులు, కేంద్ర ప్రభుత్వ భవనాలను పరిశీలించారు.



# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ఆర్టీవో

**ప్రజాశక్తి-గూడూరు రూరల్:** తప్పని సరిగా ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని గూడూరు రోడ్డు రవాణాశాఖ అధికారి ఆదినారాయణ సూచించారు. శుక్రవారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఐదవ రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులో ప్రయాణించే సమయంలో విద్యార్థులు కిటికీలలో తల, చేతులు పెట్టకూడదన్నారు. డ్రైవర్లు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తప్పనిసరిగా హెల్త్, అడ్రస్‌కు సంబంధించిన కార్డులు వారి వద్దనే ఉంచుకోవాలన్నారు. ప్రతి బస్సులో ఫస్ట్ ఎయిడ్, కార్బన్ డైయాక్సైడ్ సిలిండర్ సిద్ధంగా ఉంచాలన్నారు.


రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో

ప్రతినెలా వాటి సామర్థ్యాన్ని పరీక్షించాలన్నారు. వాహనాలను అపరిమిత వేగంతో నడపకూడదన్నారు. తల్లిదండ్రులు ప్రతినెలా ఒకసారి కళాశాల యాజమాన్యంతో సమావేశమై విద్యార్థుల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలు కండిషన్‌లో ఉండేలా కళాశాల యాజమాన్యం, డ్రైవర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మోహన్, ప్రిన్సిపల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# 'సమసమాజ స్థాపనే ధ్యేయం'

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):**
సమసమాజ స్థాపన కోసం నవ సోషలిజం పార్టీ ఆవిర్భావం చేశామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు పాకాల ఆనందం తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు, సమానత్వం లభించాలని, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పార్టీ ఏర్పాటు చేశామన్నారు. మహాత్మా గాంధీ, నేతాజీ, చంద్రబోస్, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే వంటి వారిని ఆదర్శంగా చేసుకొని మంచి లక్ష్యంతో పార్టీ కార్యకలాపాలు సాగేలా కార్యాచరణ చేశామన్నారు. సామాజికంగా,



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

ఆర్థికంగా, రాజకీయంగా సమాన స్థాయిలో హక్కులు సాధించుకోవడానికి పార్టీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో సూరిబాబు రెడ్డి, రఘుబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

# సమాజంలో అసమానతలు రూపుమాపిన మహనీయుడు అంబేద్కర్

**ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్**

**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** సమ సమాజ స్థాపన కోసం రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించిన మేధావి డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేసి ఆయన గొప్ప తనాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి చాటి చెప్పారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ కొనియాడారు. విజయవాడలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్న అతి పెద్ద అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గూడూరు నుండి వెళుతున్న వాహనాలను వారు జెండా ఊపి



ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, కోడూరు మీరారెడ్డి, చేవూరు విజయమోహన్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలి: మాజీ ఎంపీ


నారాయణవనం పర్యటనలో చింతా మోహన్

**ప్రజాశక్తి-నారాయణవనం:** రాష్ట్రంలో పేద జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని భీముని చెరువు గ్రామంలో 'మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగున్నర సంవత్సరాలుగా విధ్వంసకర పాలన కొనసాగుతుందన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డికి ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం లేదన్నారు. తహశీల్దార్ కార్యాలయంలోనూ, జిల్లా కలెక్టరేట్లోనూ ఉండాల్సిన ఓటర్ల జాబితా పోలీస్ స్టేషన్లో ఉండడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తిరుపతి ఉప ఎన్నికల్లోను దొంగ ఓట్లు అధికంగా పడ్డట్టు స్వయాన ఎలక్షన్ కమిషన్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పేదల భూములు లాక్కోవడానికి ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీసిటీలోనే వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.20వేల కనీస వేతనంగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తేజోవతి, ఎన్ఎస్‌యూఐ, నాయకులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధిలో శాస్త్రీయ ప్రణాళిక అవసరం: విసి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

**ప్రజాశక్తి-క్యాంపస్:** ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో శుక్రవారం మధ్యాహ్నం 'ఆంధ్రప్రదేశ్ డెవలప్మెంట్ డైలాగ్' పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య, నైపుణ్యాల అభివృద్ధి విషయాలపై వక్తలు ప్రసంగించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వి.సి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం పాక్షికంగా ఫీ రీయింబర్స్మెంట్ సౌకర్యం కల్పించేదని, నేడు అట్టడుగు వర్గాలకు విద్య అందించాలనే లక్ష్యంతో పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అందిస్తుందని అన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రవేశ పెట్టిన నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్స్ , సింగిల్ మేజర్ సబ్జెక్టు ఎంపిక వంటివి సమీప భవిష్యత్తులో విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపకరిస్తాయని అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన వక్త ఆచార్య బి. రంగారెడ్డి 'ఆరోగ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ సాధించిన అభివృద్ధి 'గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, పాలకమండలి సభ్యులు ఆచార్య సుగుణమ్మ, ఆచార్య సుమకిరణ్, సురేంద్రనాథ్ రెడ్డి, ఆచార్య కోలా మంజుల, నారాయణ బాబు, జ్యోతి, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య నరసయ్య, ఆచార్య దామోదర్ రెడ్డి , ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల దీక్షకు సిఐటియు మద్దతు

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** తిరుపతి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా రిలే దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సిపిఎం నాయకులు కందారపు మురళి, జి బాలసుబ్రమణ్యం సందర్శించి సంఘీభావం తెలిపారు. మేధావులైన న్యాయవాదులు సైతం నిరాహార దీక్ష చేసే స్థితికి చేరుకోవడం చాలా దురదష్టకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదుల కోర్కెలు తీర్చాలని, అదేవిధంగా భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్


న్యాయవాదులకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నేతలు

గోపీచంద్, సీనియర్ న్యాయవాదులు చల్లా వెంకటయ్య, దినకర్, రాజశేఖర్, హరికష్ణ రెడ్డి, దేవరాజులు, మురళి, ఆనంద్, హరీష్ పాల్గొన్నారు.

## ఇరు గ్రూపులపై కౌంటర్ కేసులు



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ఉప్పరపాలెంలో రెండు రోజుల క్రితం జరిగిన ఇరు గ్రూపుల మధ్య ఘర్షణకు సంబంధించి అలిపిరి పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఉప్పరపాలెంలో రెండు రోజుల క్రితం గొడవలు చోటు చేసుకున్నాయి. ఒకరిపై ఒకరు మద్యం సీసాలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రెండు ద్విచక్ర వాహనాలు, ఓ కారు ధ్వంసమైనట్లు సమాచారం అందిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆలస్యంగా ఒకరిపై నొకరు ఫిర్యాదులు చేశారని, ఉప్పరపాలెంకు చెందిన భాగ్య ఫిర్యాదు మేరకు తొమ్మిది మంది దినేష్, మధు, మురళి, ప్రసాద్, ప్రతాప్, రఘు, మనీ, పూర్ణ, నాగరత్నమ్మ లపై కేసు నమోదు చేశారు. అలాగే మురళి ఫిర్యాదు మేరకు 7 మందిపై జ్యోతి, సుహాసిని, భాగ్య, లావణ్య, సుమతి, గౌతమ్, కిరణ్‌లపై కేసు నమోదు చేసినట్లు అలిపిరి ఎస్ఐ రాజశేఖర్ వెల్లడించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# దొంగోట్ల సూత్రధారులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**
తిరుపతి పార్లమెంట్‌కు 2021లో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా దొంగ ఓట్లకు సహకరించిన అందరిపై చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు డిమాండు చేశారు. స్థానిక ఎస్‌పి కార్యాలయం వద్ద శుక్రవారం దొంగ ఓట్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ 2021 తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల సందర్భంగా ఈపిఐసి కార్డులతో వందలాది మంది దొంగ ఓట్లు వేసేందుకు పాల్పడితే ఇతర ప్రతిపక్షాలతో కలిసి కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద దొంగ ఓటర్లను నివారించామని గుర్తు చేశారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ఎ న్నికల నిర్వాహణలో ఉన్న అధికారులు తిరుపతి ఎన్నికల అధికారి లాగ్ ఇన్ ద్వారా 30వేల పైచిలుకు ఓటరు గుర్తింపు కార్డులను డౌన్‌లోడ్ చేసి దొంగ ఓట్లు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముని సుబ్రమణ్యం, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

# టిడిపి వైఖరి స్పష్టం చేయాలి: చింతామోహన్

**ప్రజాశక్తి -సత్యవేడు:**
బిజెపి పట్ల టిడిపి వైఖరిని స్పష్టం చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. శుక్రవారం సత్యవేడు మండలం శిరుణంబూదురు దళితవాడలో 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' కార్యక్రమం నిర్వహించారు. బలిజల రాజ్యాధికార ఆకాంక్ష నెరవేరాలంటే తిరుపతి నుంచి కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి కాంగ్రెస్ తరపున పోటీ చేయాలన్నారు. చిరంజీవి ఇంకా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఆశాకిరణంగా మారిందన్నారు. చంద్రబాబు బిజెపితోనే ఉంటారా, హద్దు దాటి అవతలికి వస్తారా అని చురకలు అంటించారు. రెండు పడవలపైన కాళు పెట్టి ప్రయాణం చేయొద్దని సూచించారు. ఉంటే ఇండియా కూటమితోనైనా ఉండాలని, లేదంటే ఎన్డీఏ కూటమితోనైనా ప్రయాణం సాగించాలన్నారు. ఏ గట్టున ఉంటారో తేల్చుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమన్నారు.

# అన్ని ఇళ్ళు సర్వే చేయండి - కమిషనర్

**ప్రజాశక్తి-తిరుపతిసిటీ:** కులగణన కోసం అన్ని ఇండ్లు సర్వే చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారున. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. శుక్రవారం నుండి పది రోజుల పాటు ఇంటి ఇంటికి వెళ్ళి సచివాలయ సిబ్బందిచే కుల గణన సర్వే చేయించాలని, కులాల వారి జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోగతి నమోదు చేయాలన్నారు. ఈ కులగణన ద్వారా అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రజా పథకాలు లబ్ధి చేకూర్చడానికి, పథకాలు సక్రమంగా అమలు పరచి తద్వారా సామాజిక న్యాయాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇటివల ప్రాంతీయ స్థాయి సదస్సును నిర్వహించామని, వివిధ వర్గాలకు సంబంధించిన మేధావులు పాల్గొని వారి అభిప్రాయాలను తెలిపారన్నారు. కుల గణన నిర్వహణపై విస్తృత స్థాయి అవగాహన ప్రచారం కూడా చేయడం జరిగిందన్నారు.

# 'స్వర్ణముఖి'లో ఇసుక తవ్వేస్తున్నారు..


**రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆవేదన**

**ప్రజాశక్తి-రామచంద్రపురం (చంద్రగిరి):** మండలంలోని నరసింగాపురం సమీపంలో స్వర్ణముఖీ నదిలో ఇసుక అక్రమ తరలింపుతో తమ పొలాలకు తీవ్ర సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి చిన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు. నదీ ప్రాంతంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాము ఇసుక తరలింపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చేశారు. నరసింగాపురం రెవిన్యూ గ్రామంలో తనకు సర్వే నెంబర్ 1-9, 1-10లో సుమారు 3 ఎకరాల వ్యవసాయ భూమి వుందని చెప్పారు. సదరు భూమిలో కొబ్బరి, మామిడి, అరటి చెట్లు సాగు చేసుకుంటున్నానని వివరించారు. తమ పొలం పక్కనే ఉన్న స్వర్ణముఖిలో కొందరు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. వరదలు వస్తే వాగుకు పక్కన తాము ఏర్పాటు చేసిన కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని, ఆ విధంగా జరిగితే తన భూమిలోని పంట పూర్తిగా నాశనమైయ్యే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయమై గతంలో పలుసార్లు రెవిన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేసి నదీ పరివాహక ప్రాంతంలోని పొలాలను కాపాడాలని కోరారు.


ఇసుక తోడేసిన దృశ్యాన్ని చూపుతున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి

## అబాకస్ విజేతకు మిద్దెల సన్మానం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**



చెన్నై అబాకస్ సంస్థ నిర్వహించిన అంతరాష్ట్ర మేద మెంటల్స్ పోటీలో ఛాంపియన్‌గా నిలిచిన భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ పదవ తరగతి విద్యార్థి వేగూరు పవన్‌కుమార్‌ను శుక్రవారం మాజీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, మాజీ ఆప్కో డైరెక్టర్, స్కిమ్స్ విద్యాసంస్థల అధినేత మిద్దెల హరి ఘనంగా సత్కరించారు. స్థానిక మిద్దెల హరి యువసేన కార్యాలయంలో విద్యార్థిని, విద్యార్థి తల్లిదండ్రులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే ఇలాంటి పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలుస్తారని ఆయన కొనియాడారు.